Viswa Shanthi Readers
New Mirzalguda, Secunderabad

# గులాబీ పువ్వు - సిగరెట్టు

బారులుగా చద్రున ముందుకి దూసు కొచ్చి గడుసుగా కవ్వించి తప్పుకు పోయే నాట్యక త్తెల్లా పచ్చటి చెట్లు ముందుకొచ్చి పక్కకి జారుకొంటున్నాయి. టాక్సీ కళ్లు పెద్దవి చేసుకు చూస్తోంది.

ఆఖరిదమ్ము లాగి సిగరెట్ పీక పారేస్తూ బయటికి చూశాడు ఆనందరావు. చంద్రుడు రూపాయి నాణెంలా నిండుగా ఉన్నాడు. సిగరెట్ పొగలా వెన్నెల భూమిని కమ్ముకుంటోంది. వెన్నెల చల్లగా ఉంటుందనే అపవాదు ఎలా పుట్టిందో అతనికి అర్థంకాలేదు. ఆ మధ్య ఫ్లూ వచ్చినపుడు డాక్టర్స్ బ్రాందీ తాగాడు. వెన్నెల అదే అనుభవం కలిగిస్తోంది. అదే ఉత్సాహం! అదే మత్తు! దొంగసాక్షుల్లా కవులందరూ వంత పలక్కపోతే ఈ విషయం రాయకూడదూ? ఒక వేళ ఎవరన్నా రాసారేమో! అక్కడక్కడ సభల్లో విన్నదే గాని తను చదివిందేముంది గనుక! "ఆ జాబిల్లి వెలుంగు వెల్లికిల డాయన్ లేక" అని పూర్వకవి ఎవరో రాసినట్లున్నాడు. రాయలేకపోవటమేమిటో! ష్ పోమ్మా, ఎవడిక్కావాలి కవిత్వం!

"కుంయ్ కుంయ్"

అతను చూపిందేమిటో తనూ చూడాలని చొరవగా అతన్ని తోసుకుంటూ అల్లరి చేస్తోంది కిట్టీ. ఆనందరావు గోముగా దాన్ని నిమురుతూ వొళ్ళోకి తీసుకొన్నాడు. అది అతని చేతిని నాకింది.

"టప్ టప్" కర్కశధ్వనులు.

"ఏం వెంకటస్వామీ!"

"ఇంజన్ మిస్ ఫైరవుతోందండీ, అంతే."

"ఏమో బాబూ, ఇదంతా ఎడారి."

"ఎంతండీ! పది పన్నెండు మైళ్ళు. విజయవాడ చేరగానే టైర్ మార్చేస్తానుగా."

"చేరతామా అని—"

"ఆహాఁ ఆమాత్రం లాగెయ్యనూ?"

వెంకటస్వామి నిర్లిప్తంగా సిగరెట్ పీలుస్తూ స్టీరింగ్ చక్రం దగ్గర కూర్చున్నాడేగాని లో లోపల అతనికి బెరుగ్గానే వుంది. "స్పేరు టైరు లేదు, కర్మ!" అని పక్కనవున్న క్లీనరుతో గొణిగాడు.

ఆనందరావు వాచి చూసుకున్నాడు. ఏడు దాటింది. "వివిధభారతి', వస్తుంది. ట్రాన్సిస్టర్ సెట్ చేతిలోకి తీసుకొని ఏరియల్ పైకిలాగి ట్యూన్ జేశాడు. కిట్టీ చెవులు రిక్కించింది. కొత్త టీచర్ క్లాసులో గోలలాగా వుంది. స్టేషన్ మార్చాడు. పాత టీచర్ బల్లగుద్ది చెపుతున్నట్టుగా వుంది. ప్చ! పాతబడి పోయింది. అవతల పారేసి మంచి కొత్త మోడల్ సెట్ కొనాలి. ఆనందరావు విసుగ్గా ట్యూన్ ఆఫ్ చేశాడు.

ఏదో ఊరు వస్తోంది కాబోలు. ఒక పెద చెరువు. దూరాన గుడి. అక్కడక్కడ మనుషులు.

"ఇదే ఊరోయ్?"

"ఇదండీ— క్లీనర్ ఏదో చెప్పబోయాడు.

ఢామ్మని తుపాకి పేల్చినట్లయింది. పాలిపోయిన ముఖంతో డ్రైవరు చప్పున బ్రేకువేసి ఇంజన్ ఆఫ్‌చేశాడు. నిస్సత్తువగా సీటుకి జేరగిల బడ్డాడు ఆనందరావు.

"ఏది దారి?"

"తప్పాదియ్యా, మోసంచేసిందండి.''

"పాత టాక్సీకి రంగువేసి నువ్వు మోసం చెయ్యలే!"

"ఒక్క ట్రిప్పులోనే రెండు టైర్లు బర్స్ట్ అయితే ఏంచెయ్యను బాబు?''

"సరే, ఇప్పుడేం చెయ్యటం."

"బస్సులు, లారీలు వస్తూ పోతుంటాయి గదండీ, విజయవాడ వెళ్ళి టైర్ బాగుచేయించుకొస్తాను. ఎటొచ్చీ మీకు కాస్త శ్రమ.''

తలుపుతీసి డ్రైవర్ దిగాడు. క్లీనర్ అతన్ని అనుసరించాడు. తప్పని సరిగా ఆనందరావు దిగాడు. కిట్టి కూడా అతనివెంట దూకింది.

డ్రైవరు, క్లీనరు చక్రం ఊడదీసే ప్రయత్నంలో నిమగ్నులైనారు. కిట్టి చుట్టుపక్కల ఏమిటేమిటో ముట్టెతో పరిశీలిస్తూ తిరుగుతోంది. ఆనందరావు వెంకటస్వామిని మింగేసేట్టు చూస్తూ సిగరెట్ వెలిగించాడు.

"ఇదేదో కుగ్రామంలా ఉంది. ఇక్కడ హోటళ్ళేమీ ఉండవు కాబోలు. ఆకలి దహించిపారేస్తోంది.''

అతను గొణిగాడు.

"ఎవరు బాబూ?''

ఆనందరావు ఉలిక్కిపడి వెనక్కి చూశాడు.

రాజసం ఉట్టిపడే ముఖం, బట్టతలమీద అక్కడక్కడ నెరసిన వెంట్రుకలు, దుబ్బు మీసాలు, దబ్బపండువంటి శరీరచ్ఛాయ, తెల్లటి పొందూరు ఖద్దరులాల్చీ, ధోవతీ, కండువా తన ముందు ఒక ఆజానబాహువు నుంచున్నాడు. అతని వెనకే పొడుగాటి కర్రపట్టుకొని కొంచెం ఎడంగా మరొక వ్యక్తి నుంచున్నాడు. వయస్సు కొంత మళ్ళినా, తరగని కండపుష్టి,

నల్లగా నిగనిగలాడే శరీరం ఆచ్ఛాదన లేక తెల్లటి వెన్నెల్ని గేలి చేస్తోంది.

వా ళ్ళిద్దరి వైపూ తేరిపార జూచి ఆనందరావు ఆయన ప్రశ్న జ్ఞప్తికి తెచ్చుకొని జవాబిచ్చాడు.

"హైద్రాబాదునుంచి వస్తున్నామండీ, నెల్లూరు వెళ్ళాలి. ఇక్కడ టాక్సీ చెడిపోయింది."

"టైర్ బర్స్టయిపోయింది బాబూ" అన్నాడు వెంకటస్వామి అతని వైపు చూసి.

"త్వరలో బాగుపడదు కాబోలు."

"ఏదీ, విజయవాడ వెళ్ళి వర్క్‌షాపులో బాగుచేయించాలి, రెండు గంటలైనా పడుతుంది."

"అలాగా! అంతవరకు మా యింట్లో బస చేయవచ్చు రండి, మీ పేరేమిటో చెప్పారుకాదు." అన్నాడాయన.

"ఆనందరావండి."

"నన్ను రాఘవయ్యంటారు. దగ్గిరే ఇల్లు, ఆ గుడిపక్కనే, మరి పదండి."

ఆనందరావు కొంచెం మర్యాద కోసం తటపటాయించాడు. వెంకటస్వామి "వెళ్ళరండి బాబు" అన్నాడు. రాఘవయ్య కండువా ఓసారి తీసి మళ్ళీ వేసుకొని "పదరా, వెంకా" అన్నాడు.

ఇహ మొహమాటపడకుండా లెదర్ సూట్‌కేస్ చేత్తోపట్టుకుని ట్రాన్సిస్టర్ భుజాన తగిలించుకుని 'కిట్టీ' అని కేకేశాడు ఆనందరావు. వెంకడు దారితీశాడు. అతనికాళ్ళకి అడ్డంవస్తూ కిట్టీ చలాకీగా ముందుకి పరుగులు తీయసాగింది. ఆనందరావు, రాఘవయ్య తాపీగా నడుస్తున్నారు.

రహదారిదాటి ఊళ్ళోకి వచ్చారు. దారికి రెండుపక్కలా జీబులా పెరిగిన చెట్లు చెదురుగా తాటిచెట్లు, అల్లిబిల్లి గా అల్లుకున్న తీగలు, ఇళ్ళమీద ఇళ్ళు, మట్టిరాలే గోడలు, గుహల్లా చీకటి గుయ్యారాలు, నులకమంచాలు, వాటిమీద పక్కల్లేకుండా దొర్లే పసికందులు, పక్కనే పశువులు, గడ్డి మోపులు, ఓటికుండలు, పనుల్లో సతమతమయ్యే మనుషులు. ఆనందరావు రాఘవయ్య అడుగుతున్న ప్రశ్నలకి క్లుప్తంగా జవాబిస్తూనే ఆ పరిసర వాతావరణాన్ని వింతగా మ్యూజియం,లోని వస్తువుల్లా చూస్తూ నడుస్తున్నాడు.

ఎక్కడో ఆవు 'అంబా' అంది.

పాప కేరుమంది.

ఎద్దు అంకె వేసింది.

పిల్లవాడెవరో కేరింత కొట్టాడు.

గుడిగంట గణగణ మంది.

షడ్జమంలో ఎవరో గొంతెత్తాడు.

ఈ ధ్వనుల్లో జీవం ఉందనీ, జీవితం ఉందనీ ఆనందరావు అనుకోలేదు. అతనికి విసుగ్గా ఉంది. అక్కడా అక్కడా ఓ మంచి పెంకుటిల్లో, ఓ డాబానో కనిపించి, ఓ గ్రామఫోను రికార్డో, ఓ రేడియో పాటో వినిపించి నప్పుడుమాత్రం అతనికి కాస్త మనుషుల్లో, పడ్డట్టుంది.

"ఒక్క అందమైన ముఖమైనా కనిపించదేం!" అనేది అతని మనసులోని ఫిర్యాదు.

"ఇదిగో, వచ్చేశాం. ఇలారండి."

రాఘవయ్య ఒక డాబా ఇంట్లోకి దారితీశాడు. ఆవరణలో చిన్న పూల తోట. చిన్న ఇల్లయినా చక్కటిది. వరండాలో విద్యుద్దీపం అతన్ని ఆహ్వానించింది.

"ఇలా కూర్చోండి."

పేము కుర్చీ చూపాడు రాఘవయ్య. సూట్ కేస్ కిందపెట్టి కుర్చీలో కూర్చోబోతూ ద్వారంవైపు చూశాడు ఆనందరావు. మబ్బులేని మెరుపొకటి మెరిసిపోయింది. మైగాడ్ : మసిబొగ్గుల్లో మాణిక్యం ! అత నలా ఓ రెప్పపాటు చూసీ చూడగానే కనిపెట్టేశాడు.

"అయ్యగారికి కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిచ్చి ఆ కొట్టంలోని జనప కట్టె ఎడ్లముందుకి లాగి పో. అన్నట్లు అమ్మాయేదైనా పని చెప్తుందేమో కనుక్కో. అంటూ రాఘవయ్య లోపలి కెళ్ళాడు.

వెంకడిచ్చిన నీళ్ళతో కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కున్నాక ఆనంద రావుకి ఉత్సాహం తిరిగివచ్చింది.

ద్వారందగ్గిర నిలబడిన రాఘవయ్య "లోపలికి రండి కాస్త ఫలహారం చేద్దురుగాని" అని పిలిచాడు. ఆనందరావు హాల్లోకి వెళ్ళాడు. ఎదురుగా దామెర్లవారి "సిద్ధార్థరాగోదయం" చిత్రపటం గోడకి వేళ్ళాడుతూ కన్పించింది. గోడకి ఏ వేవో ఫోటో లున్నాయి. ఒకపక్క తిధి వార నక్షత్రాలు తెలిపే క్యాలెండర్ వుంది. బల్లమీద దినపత్రిక, కొన్ని పుస్తకాలు వున్నాయి. ఒక పుస్తకం తీశాడు. గాంధీజీ ఆత్మకథ. మూసేశాడు. మరొకటి తీశాడు. మాలపల్లి. ఇంకొకటి. కన్యాశుల్కం. వేరొకటి. శాకుంతలం ప్చ్. ఓ డిటెక్టివ్ పుస్తకమున్నా కాసేపు కాలక్షేపమయేది !

బల్లమీద చప్పుడయింది. అలవాటుగా "హుష్ కిట్టీ" అన్నాడు. గాజుల చప్పుడుకూడా అయింది.

"తీసుకోండి" సన్నని స్వరం. ఆనందరావు నాలిక కొరుక్కున్నాడు.

"కానివ్వండి" రాఘవయ్య.

"మీకు చాలా శ్రమ ఇస్తున్నానండి."

"అహ(! ఇంకానయం, మా పల్లెటూరి వంటకాలు మీకు ఎలాగూ రుచించవు. ఏదో కాస్త ఆకలికి — అన్నట్టు అమ్మాయ్, వెంకడు చక్ర కేళీ తేలేదా ?"

మాటలోనే వెంకడు వచ్చాడు. అరడజను చక్రకేళీపళ్ళు బల్లమీద పెట్టాడు. రాఘవయ్య రెండు ఆనందరావువైపు నెట్టాడు. "ఇహ నువ్వెళ్ళు వెంకా" అతను శెలవు తీసుకున్నాడు.

ఆనందరావు పళ్లెంవైపు చూశాడు లడ్డు, జీడిపప్పు, బూంది, చక్రకేళి, ఆకలి అమితంగా బాధిస్తుండటంవల్ల స్వీట్ ఇష్టంలేకపోయినా తినటం ప్రారంభించాడు. కిట్టీ కాలునాకి కళ్ళలోకి చూసింది. లడ్డుముక్క అందించాడు.

"హైద్రాబాద్ ఏం పనిమీద వెళ్ళారండీ."

పిచ్చాపాటీ తిరిగి ప్రారంభించాడు రాఘవయ్య. ఏదో చెప్పబోయి ఆనందరావు మధ్యలోనే ఆపాడు. అసలు కారణం చెప్పొద్దని ఎవరో చెవిలో చెప్పినట్లయింది. ముహూర్తందాకావచ్చి ఆగిపోయిన పెళ్ళిళ్ళు ఎన్నో ! అంతా నిశ్చయమయేదాకా ఎక్కడా పొక్కకూడదు. కేవలం అసూయతో కొంతమంది ఏదో అడ్డుపుల్లలు వేస్తారు. ఈయన ఎలాంటి వాడో ! చూస్తే కాస్త రాజకీయాల వాసన ఉన్నట్టుంది. హైద్రాబాద్‌లో పరిచయస్థులుకూడా ఉండే ఉంటారు. ఉఫ్‌మని ఊదాడంటే లక్షరూపాయ లకీ తిలోదకాలే, అవును. లక్ష క్యాషుగానీ, 20 ఎకరాల ఆస్తిగాని ఇస్తా మన్నారు. లగ్నంముందే ఇచ్చేస్తార్ట. ఆ అమ్మాయి గ్రాడ్యుయేటుకూడా. దివ్యమైన సంబంధం. తను ఇంచు మించు ఒప్పుకున్నట్టే సూచించాడు. కాకపోతే మగపెళ్ళివాళ్ళ కనుక కాస్త బెట్టు చూపించాడు. లగ్నం పెట్టుకోటానికి వస్తామని వాళ్ళు చాలా ఇదిగా అన్నారు. ఉత్తరం రాస్తా నన్నాడు తను. ఈ విషయాలేవీ బయటికి రాకూడదు.

"ఉద్యోగ విషయంలో వెళ్ళానండి." అన్నాడు.

"ఏం ఉద్యో— అబ్బా."

అకస్మాత్తుగా గుండెమీద చెయ్యి వేసుకొని ద భా లు న కింద పడి పోయాడు రాఘవయ్య. ద్వారందగ్గిరే నిలబడివున్న వసంత షాక్ తగిలి నట్టు కెవ్వున కేకవేసి ఒక్క అంగలో తండ్రిదగ్గర కొచ్చింది. తింటున్న చక్రకేళి అలాగే వదిలేసి ఒక్క అదటున ఆనందరావు రాఘవయ్య పడి పోయినచోటికివచ్చి అతని చెయ్యి పట్టుకున్నాడు.

వసంత గాభరాగా "నాన్నా, నాన్నా" అని కేకలువేస్తూ అతని తల కదపసాగింది. ఆనందరావు ఆమెను వారిస్తూ 'ఆగండి, గాభరాపడకండి" అన్నాడు.

ఆమె కిదేమీ అర్థంకాక గద్గదస్వరంతో "ఏమైందండీ" అంటూ అతని కళ్ళవైపు నీళ్ళునిండిన కళ్ళతో చూసింది.

"ఆ సూట్ కేసు ఇలా అందుకోండి."

యాంత్రికంగా ఆమె అతని లెదర్ సూట్ కేస్ తెచ్చి ఇచ్చింది. అతను సూట్ కేస్ తెరిచి గుడ్డలు పక్కకు తొలగించి ఒక చిన్న పెట్టె బయటికి తీశాడు. అది వెంటనే తెరిచి ఏవో సీసాల పేర్లు చూసి ఇంజక్షన్ సిరంజి తీశాడు.

"ఈయన డాక్టరా! వసంత గుండె కుదుటపడ్డది."

"ఏమండీ, వీరికెప్పుడైనా గుండెనొప్పి వచ్చిందా పూర్వం ?

వసంత తల తిప్పింది.

"లేదండీ ఎప్పుడూ రాలేదు. లావెక్కటంమూలాన కాస్త బల హీనంగా, ఆయాసంగా ఉంటోందని మాత్రం ఈమధ్య అప్పుడప్పుడు అంటూవచ్చారు."

ఆనందరావు వింటూనే స్పిరిట్ తో నీడిల్ ని స్టెరిలైజ్ చేశాడు. ఒక యాంపుల్ తీసి సిరంజిలోకి మందు తీసుకున్నాడు.

"నరంలోకి ఇంజక్షన్ ఇవ్వాలి. ఇలా పట్టుకోండి''. అతనేంచెబితే అది ఆమె యాంత్రికంగా చేసింది.

ఇంజక్షన్ ఇచ్చి రాఘవయ్య ముఖంలోకి ఆనందరావు ఆతృతగా చూడసాగాడు.

''ఇక్కడ హాస్పటల్ ఉందాండి ?''

"ప్రభుత్వ డిస్పెన్సరీ వుందిగాని, డాక్టర్ లేడండి." ఆమె భయం భయంగా అతనివైపు చూస్తూ అంది.

రాఘవయ్య మరి కాసేపటికి కదిలాడు. 'థాంక్ గాడ్'' అని బరువు తీరినట్టు ఆనందరావు వసంతవైపు చూసి ''ఇంక భయం లేదండీ.' అన్నాడు. కృతజ్ఞతతో ఆమె స్వరం గద్గదమై నోటమాట రాలేదు. ఎలాగో గొంతు సరిచేసుకొని ''ఇంతలో ఎలా ముంచుకొచ్చిదండీ, సమ యానికి దేవుడిలా మీరు వచ్చారు. లేకపోతే మా గతేమై వుండేదో !"

"పరవాలేదండీ, మరో ఇంజక్షన్ ఇస్తాను. హాయిగా నిద్రపడ్తుంది. కొంతకాలం చికిత్స అవసరం, ఇంట్లో ఇంకెవరూ లేరా ?'' అన్నాడతను

''మా అమ్మా, అన్నయ్యా మా బంధువు లింట్లో వివాహానికి విజయ వాడ వెళ్ళారు. రావలసిందేకాని ఎందుకో ఆగిపోయారు. రేపు తప్పక వస్తారనుకుంటాను. లేకపోయినా పాలేరుతో కబురు పెట్టిస్తాను.''

"మంచిదే. అదృష్టం బాగుందండి. లేకపోతే చాలా ప్రమాదం జరిగి పోయేది. చిత్రం ! ఒక డాక్టర్ ఫ్రెండ్ అడిగితే హైద్రాబాద్ నించి ఇంజ క్షన్ కొనుక్కొస్తున్నాను. సమయానికి ఉపయోగపడ్డది.''

"గుండెజబ్బాండి ?

"కరొనరీత్రాంబాసిస్ అంటారు. గుండెకిపోయే రక్తనాళంలో రక్తం కొన్ని కారణాలవల్ల గడ్డకట్టుకు పోయి యీ ప్రమాదం సంభవిస్తుంది. వెంటనే ఇంజక్షన్ ఇవ్వకపోతే ప్రాణాపాయమే" అన్నాడు ఆనందరావు.

"మీ ఋణం తీర్చుకోలేం డాక్టర్‌గారూ."

ఆనందరావు పరవశించాడు. ఇద్దరూ సాయంపట్టి రాఘవయ్యని మంచం మీద పడుకోబెట్టారు. ఆయన కొంతసేపటికి కళ్ళు తెరిచాడు. వసంత సంతోషానికి మేరలేదు. ఆనందరావుని చూపించి "వీరు డాక్టరుగారు నాన్నా. ఇంకేం ఫరవాలేదు. మా అదృష్టం బావుంది" అని వసంత పొంగి పొర్లే సంతోషాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ చెప్పింది. రాఘవయ్యా కళ్ళల్లో కృతజ్ఞత మెరిసింది. మరొక ఇంజక్షన్‌తో ఆయన హాయిగా నిద్రించాడు.

గండం గడిచినందుకు వెయ్యి దేవుళ్ళకి మనస్సులో మొక్కి, అతనిపట్ల కృతజ్ఞతనంతా వసంత 'కిట్టి' ద్వారా వెళ్ళబోసుకుంది. ఆ సీమ కుక్క పిల్లని ఆప్యాయంగా బుజ్జగించింది. తినుబండారాలతో మేసింది. గంతులు వేయించింది.

సేద దీర్చుకుంటూ ఆనందరావు సిగరెట్ తీసి లైటర్‌తో ముట్టించి గుప్పున పొగ వదిలాడు. వసంతకి దగ్గుతెర వచ్చింది. 'సారీ' అని సిగరెట్ పారేశాడు. "ఫర్వాలేదులెండీ" అందామె.

"రోగిదగ్గర కాల్చటంకూడా మంచిది కాదులెండి" అంటూ అతను చేతి లోని ప్యాకేట్‌ని బల్లమీద పడేశాడు.

"మీ పేరు—?"

కిందిచూపులు చూస్తూ వసంత చెప్పింది.

"చదువుతున్నారా ?"

"లేదండీ ఐపోయింది. మెట్రిక్ చదివాను."

"మరి పొద్దెలా పోతుందండీ ?"

"తోచకపోతే బొమ్మలు వెసుకుంటానండీ."

"బొమ్మలా ! చెప్పరేం ! మీ చిత్రాలు చూపించకూడదూ—అభ్యంతరం లేకపోతే."

ఆమె షెల్ఫ్‌తీసి ఒక పెద్ద కవరతని కందించింది. 'ఉబుసుపోకకి పుస్తకాలు చదివి ఏవో రంగులు పులమటం నేర్చుకున్నానేగాని నాకు ఇందులో ప్రావీణ్యమేమీ లేదండీ, మీవంటివారికి చూపించతగ్గవి లేవు' అందామె నమ్రతంగా

అతనా చిత్రాల్ని పరిశీలిస్తూ "చాలా బాగున్నాయండీ" అన్నాడు. ఒక చిత్రంలో ఒక గులాబీపువ్వూ, ఒక మొగ్గ, దానిచుట్టూ సాలెగూడు, అందులో చిక్కుకుని కొన్ని కీటకాలు, కొన్ని రెమ్మలు ఉన్నాయి.

"ఈ సాలెగూడెందుకండీ ?"

ఆమె అతనికి కొంచెం దగ్గరగా వచ్చింది.

"మీ ఎదురుగా కిటికీలోంచి కనుపించే దృశ్యమేనండి అంది. ఇవాళే చిత్రించాను."

ఆనందరావు కిటికిలోంచి చూశాడు.

"గులాబీమొగ్గ తొడిగింది. మొగ్గనుమాసి చీడపురుగులు చుట్టూ చేరాయి. ఆ చీడపురుగుల్ని ఏరి పారెయ్యటానికి సాలెపురుగు ఎంతో కళాత్మకంగా గూడుకట్టింది. మొగ్గ చక్కగా వికసించింది. ఈ పరిణామాన్ని సూచిస్తూ ఆ బొమ్మ వేశానండి."

ఆమె అతని కళ్ళలోకి ప్రశంసకోసం అన్నట్టుగా కొద్ది క్షణాలు చూసింది. ఆనందరా వామె విశదీకరణను ముగ్ధుడై విన్నాడు. అక్షరాలా ముగ్ధుడై విన్నాడు. చలించే ఆమె గులాబి రంగు పెదవుల్నీ, ఆ నోగ కళ్ళలోని తెల్లని వెన్నెల్నీ చూశాడు. కిటికీలోంచి వెన్నెల వెలుగు చీకట్లలో వసంత ఆకర్షణీయమైన విగ్రహాన్ని వెల్లడిస్తుంటే ఆ సౌందర్యాన్ని కళ్ళతో

తాగేస్తున్నాడు. ఆ చిత్రాన్ని అర్థం చేసుకొని ఆమె సున్నిత హృదయాన్ని ప్రశంసించాడు.

"ఈ చిత్రం నాకు ప్రజంటుగా ఇవ్వండి."

"మీదగ్గిరే వుందికదూ ?" చమత్కారంగా వసంత అంది.

అతని కళ్ళలోకి వెలుగు వచ్చింది. వసంత ! ఆమెలో ఏదో ఆకర్షణ ! గులాబిపువ్వులా – అలాగే ఆమెవైపు చూడాలనే కోరిక బలంగా కలిగింది, ఏవో వింత అనుభం అతని మనసుని గజిబిజి చేస్తోంది. ఓహ్! అదేమిటో తనకి తెలిసి పోతోంది !

ఒక విషయం తను ఆమెని అడగాలి. ఇప్పుడే, ఏదో పవిత్రమైన వాతావరణం అలముకున్న ఆ సమయంలోనే – అతను నోరు తెరిచి ఏవో అనబోయాడు. ఉఁహుఁ ఈ ఆనందాన్ని తను చేజేతులా పోగొట్టుకోకూడదు. విధి అనుకూలించక ఆమె దగ్గర్నుంచి అనుకోని జవాబువస్తే ! జీనితాంతం జ్ఞప్తికి ఉంచుకోదగిన సంఘటన ! జీవితాన్ని మలిచే ఉదంతం. ఈ ఆనందం ఎల్లకాలం తనకి దక్కాలి. అందులో అపశ్రుతి వుండకూడదు. అతి విచిత్ర పరిస్థితిలో తను మొట్టమొదటి కేసు పట్టాడు. ఏదో అనిర్వచనీయమైన ఆనందం దివ్యమైన అనుభూతి నిస్తోంది.

"భోజనానికి లేవండి" అందామె.

"ఇంక భోజనం వద్దండి, ఆకలే మాత్రంలేదు" అన్నాడు.

"ఇంకా నయం. మీరుచేసిన మేలుకి ఆజన్మాంతం ఋణస్థులమే. భోజనమైనా పెట్టకుండా పంపమంటారా ?" అంది వసంత.

చేసినమేలు. అదేదో కాకతీయమైన మనుషుల్ని ఎంత దగ్గిరికి తెచ్చింది ! ఆ పెదవులమీది చిరునవ్వే తనకి వెలుగుచూపి దారి సుగమంచేస్తుంటే –

"చూడండి–"

ఆనందరా వేదో అడగాలని నోరుతెరిచి, సందిగ్ధంగా మళ్ళీ మౌనం వహించాడు. ఆమె అతనివైపు ప్రశ్నార్థకంగా చూసింది.

"ఏం కావాలండీ ?"–

"అహఁ కాస్త తక్కువగా వడ్డించండి. అంతే" అన్నాడు.

భోజనం ఐంది. పదిగంటలైందని గడియారపు ముళ్ళు అతన్ని హెచ్చరించాయి. సమయం మించిపోతోంది. వెంకటస్వామి వస్తూఉండాలి. ఏదో కారు పోతున్న ధ్వని !

"బాబూ" తలుపు చప్పుడైంది. ఆనందరావు హృదయం గతుక్కుమంది. రానేవచ్చాడు వెంకటస్వామి. ఓరగా వేసిన తలుపులు తెరుచుకున్నాయి. అతనే !

"కారు రెడీ బాబు."

"సరే. వస్తున్నా, సద."

వెంకటస్వామి వెనక్కి మళ్ళాడు. ఆనందరావు వసంత వైపు చూస్తూ ట్రాన్సిస్టర్ భుజాన వేసుకొని, సూట్ కేస్ పట్టుకున్నాడు. బల్లమీది సిగరెట్ ప్యాకెట్ తీసుకుని జేబులో వేసుకున్నాడు. "కిట్టి." కిట్టి దూకుతూ వచ్చి అతని కాళ్ళని చుట్టింది. వసంత ఆప్యాయంగా దాని తల నిమిరింది. "కుక్కలు త్వరగా పరిచితుల్ని మరిచిపోవుటండీ. కిట్టికి మేం జ్ఞాపకం ఉంటాం. కదు కిట్టి" వసంత గోముగా అంది.

ఇదే అదును. తను నోరార అడిగితే ఆమె తిరస్కరించలేదు. ఆక్షణం అటువంటిది. తనకి తెలుసు.

"ఇప్పుడే వెళ్ళాలా ?"

"వెళ్ళాలండీ." అన్నాడు.

"మరేం భయంలేదు కదండీ." ఆదుర్దాగా అడిగిందామె.

"సెంట్ పర్సెంట్ సక్సెసండీ" అన్నాడు ఉత్సాహంగా ఆనందరావు.

"ఈ దారిన ఎప్పుడైనా వస్తే ఇక్కడికి తప్పక వస్తారుకదూ. మీ ఉపకారం ఎప్పటికీ మర్చిపోమండీ"

"అలాగే వస్తాను, మీ ఆతిధ్యాన్ని మర్చిపోతానా!"

ఆహ్వానం, అంగీకారం ఆనందరావు తనని ప్రశంసించాడు లోలోపల.

"ఏం ఆతిధ్యమండీ. అవస్థ పెట్టాం, ఎంతో మంచివారుకనుక తోడ్పడ్డారు" మళ్ళీ మెచ్చుకుంటుంది వసంత.

మంచివాడు! తనని ఎవరూ అంతవరకు మంచివాడని అన్న జ్ఞాపకం లేదు. హౌస్ సర్జన్ చేస్తున్నప్పుడు ఒక్క రోగికూడా అలా అనలేదు. అవును; తనేం చేశాడని; తన మంచితనమేమిటో తనకే తెలీదు. మనుషుల్లో ఆ గుణాన్ని తను అనుభవించినగుర్తూలేదు. ఎంతసేపటికీ ఎనాటమీ, డిస్సెక్షనూ, పేథాలజీ-; అబ్బ, ఇప్పటివరకూ మనిషంటే అవయవాల కూర్పు అనే తన అభిప్రాయం. కాని ఇవాళ ఆ అభిప్రాయం మారిపోతోంది. ఏదో చెప్పలేని ఆనందానుభవం తనని ముంచెత్తివేస్తోంది. వసంతతో ఆ కాస్తమాటా అంటే! ఆమ్మో! తను మంచివాడని ఆమె నమ్మకం. ఆ అభిప్రాయం ఆమె మార్చుకోవలసిన అవసరం ఏర్పడితే! ఆనందరావు నిలువెల్లా వణికాడు. ఈ క్షణం ఆ ఆలోచనజోలికి పోకూడదు. ఈరాత్రి అజరామరం, ఈ కాంతికి నీడలేదు. ఈ మధుర సంగీతంలో ఏ అపశ్రుతీ రాకూడదు.

వెంకటస్వామి మళ్ళీ కేకేశాడు. ఆనందరావు వదనం ప్రసన్నంగాపెట్టి "వెళ్ళివస్తానండి" అన్నాడు. ఆమెచేతులు జోడించింది.

ఆనందరావు సాగిపోయాడు. పల్లె పల్లెంతా అందమైన వర్ణచిత్రంలా కనిపించిం దతనికి. ఆకాశంలోకి చూశాడు. విచ్చిన మల్లెపువ్వులా వున్నాడు చంద్రుడు. పన్నీటి జల్లులా వెన్నెల కురుస్తోంది. పన్నీటి జల్లులా!

వెంకటస్వామి కారు తలుపుతీశాడు.

పరధ్యానంగా సీటుకి జేరగిలబడ్డాడు ఆనందరావు, కీట్టీ బుద్ధిగా అతని పక్కనే కాళ్ళు ముడుచుకు కూర్చుంది. రథంలా కదిలి కారు క్రమంగా జోరుగా ఆ పల్లెకీ, పల్లెవారికీ దూరమై పోసాగింది.

సిగరెట్ ప్యాకెట్‌తీసి సిగరెట్ వెలిగించాడు ఆనందరావు, వసంత దగ్గి నట్టుగా, వినిపించి ఉలిక్కిపడ్డాడు. మనో ఫలకంమీద ఆమె ప్రత్యక్ష మైంది, గులాబిపువ్వులా - గులాబీపువ్వు!

ఆమె ప్రజంటుచేసిన రేఖాచిత్రం కళ్ళలో మెదిలింది, ఒక గులాబీపువ్వు. వికసించబోతున్న ఒక మొగ్గ, సాలెగూడు, కీటకాలు, రెమ్మలు -

ఆనందరావు మనసుని తెలియని ఆనందమేదో ఆవరించింది. ఆ క్షణమే నోరంతా సిగరెట్ పొగతో చేదెక్కినట్టుగా అనుభూతి కలిగింది.

బద్ధకంగా టాక్సీనడుపుతున్న వెంకటస్వామి ఉలిక్కిపడ్డాడు. అతనివొళ్ళో సిగరెట్ ప్యాకెట్ పడ్డది.

"నిద్ర వస్తున్నట్టుంది. సిగరెట్ కాల్చుకోవోయ్" అన్నాడు ఆనందరావు నవ్వుతూ.

వెంకటస్వామి ముఖం వికసించింది.

"యాక్సిడెంట్ చెయ్యనులెండిసార్" అని నవ్వుతూ అతను సిగరెట్ ముట్టించాడు.

చంద్రుడు ఉల్లాసంగా ఆనందరావు వెంట పరుగెడుతూనే ఉన్నాడు. సిగరెట్ మాత్రం అతనిపట్ల కోపంతో రోడ్డుమీద మండిపోతూఉంది,

(1965)

— o —